ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

హిందూపురం టౌన్: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నమార్కెట్ సర్కిల్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పెన్నోబులం అధ్యక్షతన వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి భాషా సంయుక్త రాష్ట్రం ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. అనంతరం విద్యార్థులకు శంకర్‌నారాయణ ఇంగ్లిష్, తెలుగు నిఘంటువులను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూర్యనారాయణ, వైస్ గవర్నర్ కళా హరికుమార్, ఉపాధ్యక్షుడు కుమార్, ఇంటర్ నేషనల్ కో–ఆర్డినేటర్ దాసా గంగాధర్, సభ్యులు కల్యాణ్, దేవేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- పెనుకొండ: పట్టణంలోని ఆర్యవైశ్య కన్వెన్షన్ భవనంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా జరిగింది. స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు సుధాకర్ గుప్తా, సూర్యనారాయణ, నాగరాజు తదితరులు మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణాలు అర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. తెలుగు వారి గుండెల్లో ఆయన జీవించే ఉంటారని తెలిపారు.



పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అమరజీవి చిత్రపటానికి నివాళి



పెనుకొండ: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

- పరిగి: ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి భాషా ప్రయుక్త ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి అందరికీ ఆదర్శనీయమని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు తెలిపారు. విద్యార్థులతో కలసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ బోధించిన అహింస, సత్యం, శాంతి, హరిజనోద్ధరణ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం కోసం ఉద్యమించారని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమ కాలం నుంచే ఆంధ్ర రాష్ట్ర సాధనకు పోరాడి, చివరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారన్నారు. నేటి యువత పొట్టి శ్రీరాములును స్ఫూర్తిగా తీసుకుని మెలగాలని ఆకాంక్షించారు.
- చిలమత్తూరు: ఆంధ్ర రాష్ట్ర సాధకుడు అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర సాధనకు నిరాహార దీక్ష చేసి, తన ప్రాణాలను పణంగా పెట్టి తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి జయేంద్ర నాయక్, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం టౌన్: విద్యార్థులకు నిఘంటువులను అందజేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు



చిలమత్తూరు: గ్రంథాలయంలో అమరజీవి చిత్రపటం వద్ద నివాళులు

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం

మడకశిర/అమరాపురం: నియోజకవర్గంలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని మొత్తం 6 కేంద్రాల్లో 1,618 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా.. 1,594 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. మడకశిరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 378 మందికి గాను 377 మంది హాజరయ్యారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 232 మందికి గాను 228 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 373 మందికి గాను 370 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. అగళిలో 181 మందికి గాను 178 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదు. అదే విధంగా గుడిబండలో 214 మందికి గాను 213 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. అమరాపురంలో 231 మందికి గాను 228 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

రొద్దం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 104 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు.

పరిగి: మండలంలోని ఏపీఆర్‌జేసీలో మొత్తం 305 మంది విద్యార్థులకు గాను 299 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ఆరుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

గోరంట్ల: స్థానిక ఎస్‌ఏపీఎస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 259 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 8 మంది విద్యార్థులు మాత్రమే గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు.

హిందూపురం టౌన్: పట్టణంలోని 9 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా 3,027 మంది విద్యార్థులకు గాను 2,973 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 54 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చిలమత్తూరు: బైరేకుంట వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 317 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 307 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా తెలిపారు.

బీజేపీలో త్రిముఖ పోటీ

- ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీపడుతున్న ముగ్గురు నేతలు



లాయర్ కృష్ణానాయక్



శివకుమార్ సాకేల్



కొత్తూరు హనుమంతరాయప్ప

పావగడ: స్థానిక విధానసభ క్షేత్రం ఎమ్మెల్యే టికెట్‌కు బీజేపీలో పోటీ నెలకొంది. స్థానిక సీనియర్ బీజేపీ నాయకుడు లాయర్ కృష్ణానాయక్, శివకుమార్ సాకేల్, కొత్తూరు హనుమంతరాయప్ప మధ్య పోటీ నెలకొంది. ఎవరికి వారు తమదైన శైలిలో టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా లాయర్ కృష్ణానాయక్ టికెట్ కోసం రెండుసార్లు ప్రయత్నించి, విఫలమయ్యారు. ఈ సారి ఎలాగైనా టికెట్ సాధించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. తాలూకా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ బీజేపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. విజయ సంకల్ప అభియాన కార్యక్రమంలో భాగంగా తనకు కేటాయించిన గ్రామాల్లో బీజేపీ పథకాలను ప్రజలకు వివరించారు. ఎస్సీ వర్గంలోని లంబాణి వర్గానికి చెందిన కృష్ణానాయక్ కుల ప్రాతిపదికన టికెట్ రావొచ్చని భావిస్తున్నారు. తాలూకా వ్యాప్తంగా అత్యంత జనాభా ఉన్న ఎస్సీలోని మాదిగ సామాజిక వర్గానికి చెందిన శివకుమార్ సాకేల్ టికెట్ దక్కుతుందని భావిస్తున్నారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన కొత్తూరు హనుమంతరాయప్ప సైతం రెండు పర్యాయాలుగా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ సారి అదృష్టం తనను వరిస్తుందని ధీమాగా ఉన్నారు. అయితే కాంగ్రెస్‌లో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన హెచ్‌వి వెంకటేశ్‌కు టికెట్ దాదాపుగా ఖరారైంది. జేడీఎస్‌లో మాదిగ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్పకు ఇప్పటికే టికెట్ ఖరారు కాగా.. ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. బీజేపీ టికెట్ ఎవరికి దక్కుతుందో వేచి చూడాలి మరి.

కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో విరివిరిగా ఉపాధి పనులు చేపట్టి, కూలీల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టామని ఏపీడీ జయసింహా తెలిపారు. గురువారం హరేసముద్రంలో ఉపాధి పనులు ప్రారంభించడానికి కుంటను పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఉపాధి పనులపై గ్రామాల్లో కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కువ సంఖ్యలో కూలీలు ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోనేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కూలీలందరికీ స్థానికంగా పనులు కల్పిస్తామని తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నీడ, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరియన్న, ఏపీఓ శ్రీకాంత్‌గౌడు, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ భార్గవి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ ప్రతి జబ్‌కార్డు ఉన్న కూలీకి ఉపాధి పనులు కల్పించాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలోనూ గ్రామ సభలు ఏర్పాటు చేసి ఉపాధి కూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పనులకు వచ్చే విధంగా చూడాలన్నారు.



పనులు ప్రారంభించేందుకు కుంటను పరిశీలిస్తున్న ఏపీడీ జయసింహా

పెంపుడు జీవాలపై శ్రద్ధ తీసుకోండి

రొళ్ల: గ్రామాల్లో పెంపుడు జీవాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశువైద్యశాఖ సహాయకురాలు శశికళ, గోపాల మిత్ర నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గాలికుంట వ్యాధి నివారణకు ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేశారు. ఎండా కాలంలో గాలికుంట వ్యాధి జీవాలకు సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. రైతులు తప్పనిసరిగా పాడి ఆవులు, గేదెలకు టీకాలు వేయించాలన్నారు. అదేవిధంగా గొర్రెలు, మేకల జీవాల పట్ల కాపర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైన వ్యాధులు సోకితే వెంటనే పశువైద్యశాఖ అధికారులను సంప్రదించి జీవాలకు టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ జేఈఓ కృష్ణమోహన్, సహాయకులు సురేష్, అణ్ణప్ప స్వామి, గోపాల మిత్రులు ఈరన్న, ప్రవీణ్, రవికుమార్, హరీష్ పాల్గొన్నారు.



బీజీ హళ్లిలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

నాణ్యమైన భోజనం అందించాలి

అమరాపురం: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ సత్యనారాయణ సూచించారు. గురువారం మండలంలోని కెంకెర గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం సాంబార్ బాత్, గుడ్డు వడ్డించాల్సి ఉండగా సాంబార్‌లో తగినంత కూరగాయలు, వంట నూనె లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇక మీదట సక్రమంగా వంట వండితేనే బిల్లులు మంజూరు చేస్తామని ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరించారు. రోజూ మధ్యాహ్న భోజనానికి సక్రమంగా కంది పప్పు ఇతర పప్పు దినుసులు, కూరగాయాలు నూనె వేస్తారా లేదా అని హెచ్‌ఎం లేదా ఉపాధ్యాయుడు పర్యవేక్షించాలని సూచించారు.

గుడిబండ: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి నాణ్యమైన విద్యను బోధించాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని జవనడుకు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. అనంతరం 5వ తరగతి విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠాన్ని చదివించారు. ఇంగ్లిష్ పాఠాన్ని ఏ విధంగా చదవాలో సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.



కెంకెర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



గాయపడిన నబీరసూల్

బత్తలపల్లి: అనంతపురం–కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని గంటాపురం క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు...ధర్మవరం పట్టణానికి చెందిన నబీరసూల్ బైక్‌పై వెళ్తూ జాతీయ రహదారి నుంచి గంటాపురం గ్రామానికి వెళ్లేందుకు క్రాస్ అయ్యాడు. ఇదే సమయంలో బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వైపు ఉన్న దాబా వద్దకు బైక్‌లో వెళ్తున్న ధర్మవరం పట్టణ నివాసి సాయి...నబీరసూల్ బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో నబీరసూల్ తలకు బలమైన గాయాలు కాగా సాయికి స్వల్పగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆర్డీటీ ఆస్పత్రికి తరలించినట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఈఘటన జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు... లక్ష్మీచెన్నకేశవపురంలో సుబ్రహ్మణ్య, ఈశ్వరమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన సుబ్రహ్మణ్య... మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని కోరగా భార్య నిరాకరించింది. దీంతో అతను సూపర్‌వాస్మాల్ ద్రావకం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం

ముదిగుబ్బ: పట్నం పోలీసుస్టేషన్ పరిధిలోని చిరగారిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ కుమార్తె అనూష అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. బంధువులు ఇళ్లు, ఆమె స్నేహితుల ఇళ్లలో గాలించినా అనూష ఆచూకీ కనిపించకపోవడంతో గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. యువతి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

నీట్‌లో ‘పురం’ విద్యార్థిని సత్తా



అధికాఅజుమ్

హిందూపురం: ఇటీవల విడుదలైన నీట్ పీజీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో హిందూపురం పట్టణానికి చెందిన జీఎం అతావుల్లా, నసీబాఅజుమ్ కుమార్తె అధికాఅజుమ్ సత్తా చాటింది. ఆల్ ఇండియా 2237 ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి సన్నిహితులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి



తలుపుల: పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన వేమలగొంది గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చెన్నక్రిష్ణ శుక్రవారం సాయంత్రం పొలంలో ఎద్దులను మేపుతుండగా గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈక్రమంలో పిడుగు పడటంతో ఎద్దు మృతి చెందింది. రూ.50వేల విలువైన ఎద్దు కళ్లెదుటే మృతి చెందడంతో అన్నదాత తీవ్ర వేదనకు గురయ్యాడు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక



విద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి విద్యార్థి సాయిక్రిష్ణ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థి ఫింగర్ ప్రింట్ బేస్‌డ్‌ఆన్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ఉంచినట్లు ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్ప తెలిపారు. ఇందులో మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థికి గైడ్‌గా ఉపాధ్యాయురాలు శ్యామ్యూల్‌మణి వ్యవహరించారన్నారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి సమస్యకు పరిష్కారం



పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం

మడకశిర(అగళి): అగళి మండలంలోని మధూడిలో గురువారం సర్పంచు శివకుమార్ తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ గ్రామంలోని బీసీ కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని స్థానికులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రస్తుతం తన సొంత ఖర్చులతో సర్పంచ్ బీసీ కాలనీకి పైప్‌లైన్ వేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

మడకశిర(అగళి): అగళి మండలం ఇరిగేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు పాఠశాలలను గురువారం అధికారులు సందర్శించారు. వందశాతం మరుగుదొడ్లు వినియోగించడం, ప్లాస్టిక్ రహిత పంచాయతీ, గ్రామాల్లో పూర్తిస్థాయిలో శుభ్రత పాటించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ కో–ఆర్డినేటర్ సునీత, ఈఓఆర్డీ పద్మ, గ్రామ కార్యదర్శి వేణుగోపాల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

పెనుకొండ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు ఆర్టీసీ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం డిపో ముందు నిరసన తెలిపారు. అలవెన్సులు, పీఆర్‌సీ బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, బదలీల ప్రక్రియ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిటీ మెంబర్ బాబన్న, అంజినేయులు, డిపో సెక్రటరీ వెంకటేసులు, జాయింట్ సెక్రటరీ కృష్ణ, ముత్యాలప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకుల (బాలురు) విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మైలారప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి విద్యార్థులు https://apfpcet.apcfrr.in, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు https://apfpcet.apcfrr.in&https://apfpcet.apcfrr.in/inter వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

భూముల్ని సద్వినియోగం చేసుకోండి



సాగువళి పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: సివా జాస్తి భూముల్ని నిర్లక్ష్యం చేయకుండా సాగు చేసి పంటలు పండించుకుని జీవనాధారంగా వినియోగించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప లబ్ధిదారులకు సూచించారు. గురువారం స్థానిక తాలూకా కార్యాలయం మీటింగ్ హాలులో సివా జాస్తి భూముల సాగువళి పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేడు 66 మంది లబ్ధిదారులకు సాగువళి పత్రాలు అందించామన్నారు. ఇంత వరకూ మొత్తం 666 సాగువళి పత్రాలు అందించామని.. ఇంకా 579 పత్రాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, శిరస్తుదారు ఎన్ మూర్తి, ఆర్‌ఐలు రాజగోపాల్, కిరణ్ సివాజాస్తి సమితి డైరెక్టర్లు కడపలకెరె నవీన్, బెళ్ళిబెట్టు పాలయ్య, సిద్ధలింగమ్మ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామానికి చెందిన కరియప్ప కుమార్తె కవిత బుధవారం రాత్రి నుంచి కనిపించడం లేదని గురువారం సాయంత్రం ఫిర్యాదు అందినట్లు ఏఎస్‌ఐ బాలాజీ తెలిపారు. వివరాలు.. ఇంట్లో భోజనం చేసిన తర్వాత కవిత ఎవరికి చెప్పా పెట్టకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకూ స్వగ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించిన ఫలితం లేకుండా పోయింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిస్తే 9441171633 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండల కేంద్రానికి చెందిన సి.ఆదినారాయణ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల సాయాన్ని గురువారం స్థానిక సచివాలయంలో మృతుడి భార్య గంగాదేవికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి మారుతి తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్‌లో చేరిక



జేడీఎస్‌లో చేరిన ముతవల్లి లతీఫ్, తదితరులు

పావగడ: తాను కాంగ్రెస్‌లోకి చేరలేదని జేడీఎస్‌లోనే ఉన్నానని స్థానిక జామియా మసీదు ముతవల్లి లతీఫ్ స్పష్టం చేశారు. స్థానిక మెహర్ బాబా ఆలయంలో గురువారం నిర్వహించిన జేడీఎస్ చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తనను కష్ట కాలంలో ఆదుకున్న మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప మేలును ఎన్నటికీ మరువనన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప తన ఇంటికి వచ్చి భోజనం చేశాడని.. ఈ సందర్భంలో తనకు కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్లు ప్రకటించాడన్నారు. అయితే తాను కాంగ్రెస్‌లోకి చేరలేదని వెల్లడించారు. కార్యక్రమంలో జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్ప, రామకృష్ణారెడ్డి, గడ్డం తిమ్మరాజు, యూనిస్, గుట్ట హళ్ళి మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం



లోకేశ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

మడకశిర(అగళి): అగళి మండలంలోని మధూడిలో ఇటీవల నీటి గుంతలో పడి మృతి చెందిన 10వ తరగతి విద్యార్థి లోకేశ్ కుటుంబానికి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అండగా నిలిచారు. గురువారం రూ.41,500 ఆర్థిక సాయాన్ని మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు అన్ని విధాలుగా అండగా ఉంటామని మృతుడి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దొడగాటమ్మ, కరియమ్మకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అమరాపురం: మండల పరిధిలోని హలుకూరు సమీపంలో వెలసిన దొడగాటమ్మ, కరియమ్మ దేవతలకు గురువారం ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవార్లకు వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హలుకూరు, చిట్నడకు, కాచికుంట, ఉదుగూరు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెనుకొండ: పట్టణంలోని కోటలో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ 9వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా షిర్డీసాయి బాబా చిత్రపటానికి పూజలు చేశారు. ఆలయంలో నాగప్రసాద్‌శర్మ, ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో ఓంకారం, సుప్రభాత సేవలు, హోమ వేడుకలు నిర్వహించారు. నగర సంకీర్తన చేపట్టి భజనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.